## క్లుప్తంగా

### పశువుల యజమానులకు హెచ్చరిక


గోపు మల్లారెడ్డి

నారాయణఖేడ్: రోడ్లపై పశువులు సంచరిస్తే వాటి యజమానులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి ఆదివారం హెచ్చరించారు. పశువులు రోడ్లపై సంచరించడం, తిష్టవేస్తుండటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బుధవారంలోగా రోడ్లపై సంచరిస్తున్న పశువులను వాటి యజమానులు తీసుకెళ్లాలని లేనిపక్షంలో గోశాలకు తరలిస్తామన్నారు. తరలించే సమయంలో ఎవరైనా అడ్డుకోవడానికి యత్నిస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

### పార్కు అభివృద్ధికి నిధులు కేటాయించాలి


రాజీవ్ పార్కులో పాడైన ఆట వస్తువులు

సంగారెడ్డి: పట్టణంలోని రాజీవ్ పార్కుని గత ప్రభుత్వం మూడేళ్లు పట్టించుకోలేదని జన జాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ ఆరోపించారు. ఆదివారం పార్కులో కలియతిరిగిన అనంతరం మాట్లాడారు. పచ్చదనంతో కళకళలాడే పార్కు కరోనా లాక్ డౌన్ ప్రారంభం కావడంతో మూసివేశారన్నారు. దీంతో పార్కులో దట్టంగా పిచ్చి మొక్కలు పెరిగాయని, ఆట పరికరాలు తుప్పు పట్టాయని, పార్క్ అడవిలా మారిందని తెలిపారు. అంతేకాకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. పట్టణ ప్రజలు ఆహ్లాదం కోసం ఆదివారం కుటుంబ సభ్యులతో గడిపే పరిస్థితి లేదన్నారు. లైటింగ్ సౌకర్యం లేకపోవడంతో సాయంత్రం 6 గంటలకు మూసివేస్తున్నారన్నారు. ప్రభుత్వం పార్కు అభివృద్ధికి రూ.కోటి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట చింత సాయికుమార్, రాములు ఉన్నారు.

### సంక్షోభంలోకి నెట్టేలా కేంద్రబడ్జెట్



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

నారాయణఖేడ్: కేంద్ర ప్రభుత్వం ఈమధ్య ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సంపన్నులకు దోచిపెట్టి రైతులను సంక్షోభంలోకి నెట్టేలా ఉందని సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు అతిమేల మాణిక్ విమర్శించారు. నారాయణఖేడ్‌లో ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్‌ను నిరసిస్తూ బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని, ఏటా రూ.2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చలేదన్నారు. బడ్జెట్‌లో అంకెల గారడితప్ప సంక్షేమం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, రైతు, ప్రజాసంఘాల నాయకులు నర్సింహులు, చిరంజీవి, సతీష్, మోషప్ప, సంతోష్, పవన్, సత్యవందన పాల్గొన్నారు.

### మంత్రిని కలిసిన నేతలు


మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ నాయకులతో కలిసి తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివ శంకర్ ఆదివారం మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెల్లాపూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించామన్నారు. విగ్రహ ఏర్పాటుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ మాజీ అధ్యక్షుడు అవినాష్ గౌడ్, ఓబీసీ అధ్యక్షుడు ధరణి రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కార్యకర్తలకు అండగా ఉంటాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని రాష్ట్ర మాజీ శాసనమండలి ప్రొటెమ్ చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరులో నిర్వహించిన సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిన ఘనత తమ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

# తప్పిన యాతన

- గుట్టపైన స్కూల్, గుట్ట కింద గ్రామం
- నిత్యం పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులకు తిప్పలు
- మెట్ల మార్గం నిర్మించిన ప్రైవేటు కంపెనీ
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

జహీరాబాద్ టౌన్: పాఠశాలకు, గ్రామానికి మధ్య మెట్ల రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో విద్యార్థులకు కష్టాలు తొలగాయి. జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల గుట్టపై ఉంది. దీంతో ఇంటి నుంచి స్కూల్‌కు పిల్లలు కిలోమీటర్ దూరం చుట్టూ తిరిగి వెళ్లాలి. అంతేకాకుండా ముందుగానే బయలుదేరాల్సి వస్తుంది. చుట్టూ తిరిగి వెళ్లడానికి ఇష్టంలేని పెద్ద పిల్లలు గుట్ట ఎక్కి బడికి వెళ్తున్నారు. స్కూల్‌కు, గ్రామానికి మధ్య సీసీ రోడ్డు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. మెట్ల మార్గం నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు అవసరం కావడంతో పనులు చేపట్టలేదు. ప్రభుత్వాలు మారిన రోడ్డు గురించి పట్టించుకొనేవారు కరువైయ్యారు. బూచినెల్లి శివారు ప్రాంతానికి కంపెనీలు రావడంతో గ్రామంలో అభివృద్ధికి బాటలు పడ్డాయి. పలు కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం ప్రారంభించారు. గ్రామ పరిధిలోగల సీఐఈ ఆటోమోటివ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం రూ.51 లక్షల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. పంచాయతీ కార్యదర్శి శ్వేత పర్యవేక్షణలో గ్రామంలో సీసీ రోడ్లు, మురికి కాలువలు, హైమాస్ట్ లైట్లు వేశారు. గుట్టను తవ్వి పాటు పాఠశాల నుంచి గ్రామం వరకు మెట్ల మార్గం వేయించారు. ప్రమాదాలు జరగకుండా రోడ్డుకు ఇరువైపుల ఇనుప రాడ్లను ఏర్పాటు చేశారు. జనవరి 24వ తేదీన అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. మెట్ల మార్గన్ని ప్రారంభించిన సీఐఈ కంపెనీ ప్రతినిధులను అభినందించారు. ఎట్టకేలకు మెట్ల మార్గం నిర్మాణంతో విద్యార్థుల కష్టాలు తొలగిపోవడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పాఠశాల నుంచి గ్రామం వరకు నిర్మించిన మెట్ల మార్గం


మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, కంపెనీ ప్రతినిధులు

### కంపెనీల వల్లే అభివృద్ధి



బూచినెల్లి పారిశ్రామిక వాడలో వెలిసిన కంపెనీలతో గ్రామాభివృద్ధి సాధ్యమవుతుంది. గ్రామాభివృద్ధి కోసం లక్షలు వెచ్చించి పనులు చేయిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మెట్ల మార్గం నిర్మాణానికి కంపెనీ ముందుకు వచ్చి సీఎస్ఆర్ నిధులతో వేయించింది.

– శ్రీనివాస్, బూచినెల్లి

# వనభోజనాలతో ఐక్యత పెరుగుతుంది


మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: వన భోజనాలతో ఐక్యత, స్నేహ భావం పెంపొందుతుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. జహీరాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 29వ వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ పరిధిలోని హోతి(కె) గ్రామ శివారులో నిర్వహించిన కార్యక్రమానికి రాజకీయ నాయకులు, సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పద్మశాలీలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలన్నారు. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ముందుగా ఆటలు పోటీలు నిర్వహించారు. వినోద కార్యక్రమాల్లో పిల్లలు, మహిళలు సందడి చేశారు. బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తి అశోక్ నామాల, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, ఎంపీపీ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయ స్వామి భక్తులకు ఘన స్వాగతం


భక్తులకు స్వాగతం పలుకుతున్న ఢిల్లీ వసంత్ బృందం

జహీరాబాద్ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న దత్తాత్రేయ భక్తులు ఆదివారం జహీరాబాద్‌కు చేరుకున్నారు. వీరు పస్తాపూర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించారు. భక్త బృందానికి ఢిల్లీ వసంత్ ఆధ్వర్యంలో పాదపూజ నిర్వహించి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వసంత్ మాట్లాడుతూ గురుపరంపరకు ఆద్యుడు శ్రీ దత్తాత్రేయ స్వామి అన్నారు. సామాజిక విలువలను పటిష్టం చేసే భక్తి ఉద్యమాలు దేశానికి అవసరమన్నారు. ఆలయ ధర్మకర్త వేణుగోపాల్, పండిత్ బద్రి నారాయణ పంతులు, మాత కుసుమ దేవి జహీరాబాద్ ప్రజలకు ఆశీర్వచనం చేశారు.

# ఉచిత వైద్యశిబిరానికి భారీ స్పందన


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: ఓ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి భారీ స్పందన వచ్చింది. పట్టణంలోని శాంతినగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం చీఫ్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. శిబిరంలో 1,150 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గిరిధర్‌రెడ్డి, డాక్టర్ ఉజ్వల్ పౌండేషన్ చారిటబుల్ ట్రాస్టు చైర్మన్ డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మట్టి టిప్పర్ల పట్టివేత


అధికారులు సీజ్ చేసిన మట్టి టిప్పర్లు

జిన్నారం(పటాన్‌చెరు): అక్రమంగా నల్లమట్టిని తరలిస్తున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు, పోలీసులు ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. నర్సాపూర్ నుంచి గుమ్మడిదల మీదుగా అన్నారం గ్రామానికి నల్లమట్టిని తరలిస్తున్న విషయాన్ని స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గుమ్మడిదల తహసీల్దార్ గంగాభవాని ఆదేశాల మేరకు ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి గుమ్మడిదలలోని టోల్‌గేట్ వద్ద 30 టిప్పర్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాటిని సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మట్టిని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

# పైపులైన్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

జహీరాబాద్ టౌన్: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీకి మిషన్ భగీరథ అధికారులు మరమ్మతులు చేపట్టారు. జహీరాబాద్ పట్టణంలోని మూసానగర్ నుంచి ఫయాజ్ నగర్‌కు వెళ్లేదారిలో అటవీశాఖ కార్యాలయ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి రోడ్డు బురదగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఈనెల 3వ తేదీన 'పైప్‌లైన్ లీకేజీతో అవస్థలు' శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పగిలిన పైపులైన్ పగిలిన చోట మరమ్మతులు చేయించారు.

సాక్షి స్పందన

# కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి


బొంతపల్లిలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజయ్య తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి సత్తయ్య పిలుపునిచ్చారు. ఆదివారం భెల్ కాలనీలో ఏర్పాటు చేసిన హెచ్ఎంఎస్ ముఖ్య నేతల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. గతంలో ప్రధానంగా 18 డిమాండ్ల సాధనకై అనేక పోరాటాలు చేసినా పాలకులు పట్టించుకోలేదన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 16వ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీలకు, పంచాయతీ కార్మికులకు, మెకానిక్‌లకు, స్కీం వర్కర్లకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పాలకులు వెంటనే నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. గ్యారంటీతో కూడిన సేకరణతో పాటు అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఉండేలా చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో భెల్ బీఎంయూ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం**

జిన్నారం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, వీటిపై అలుపెరగని పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య పిలుపునిచ్చారు. ఈనెల 16వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్‌ను గుమ్మడిదల మండలం బొంతపల్లిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్‌గౌడ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

**సమ్మెను జయప్రదం చేయండి**

జోగిపేట(అందోల్): బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు పిలుపునిచ్చారు. ఆదివారం జోగిపేటలో కరపత్రాలు పంపిణీ చేశారు.

**పోస్టర్ ఆవిష్కరణ**

సంగారెడ్డి అర్బన్: ఫిబ్రవరి 16వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ పోస్టర్‌ను సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మల్లేశం విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రికి వినతి

నారాయణఖేడ్: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పనిచేస్తున్న ఆత్మ సిబ్బంది ఆదివారం మంత్రి దామోదర రాజనర్సింహను సంగారెడ్డిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. నెలనెల వేతనాలు అందకపోవడంతోపాటు అదనంగా ఏఈఓ విధులు సైతం నిర్వహించక తప్పడంలేదన్నారు. ఉద్యోగభద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి న్యాయం చేస్తామని హామీనిచ్చినట్లు ఆత్మ సిబ్బంది తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న ఆత్మ సిబ్బంది

# అభివృద్ధి నిధుల కోసం సీఎంకు వినతి


నిధులు మంజూరు చేయాలని కోరుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం రాత్రి హైదరాబాద్ సచివాలయంలో కలిసి కోరారు. ఏయే పనులకు ఎంత మేర నిధులు అవసరమో వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీనిచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

# పట్టుదలతో చదివితే లక్ష్యం చేరుకోవచ్చు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని చేరుతారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని డిగ్రీ కళాశాలలో బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అభ్యాస కేంద్రం-36 లో మొదటి సంవత్సరం అభ్యాసకులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటించడంతోపాటు ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉన్నతమైన స్థానంలో నిలవాలన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ విద్యతోపాటు నైతిక విలువలు బోధించాలి**



పటాన్‌చెరు: విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలను బోధించాలని మాజీ కార్పొరేటర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సపాన్‌దేవ్ అన్నారు. శనివారం రాత్రి పటాన్‌చెరులోని ఓ పాఠశాల వార్షికోత్సవానికి ఎంఈఓ పీపీ రాథోడ్‌తో కలిసి హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

**◆ విద్యార్థులకు మోటివేషన్ తరగతులు**

జిన్నారం(పటాన్‌చెరు): పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మానసిక ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి అంశంపై ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు వీరేందర్ సోమవారం మోటివేషన్ తరగతులు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. గడ్డపోతారంలోని పులిగిల్ల ఫంక్షన్ హాలులో ఉదయం 9 గంటలకు తరగతులు ప్రారంభమవుతాయని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**◆ నేడు మున్సిపల్ సమావేశం**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. సమావేశానికి సభ్యులతో పాటు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

**◆ అమీన్‌పూర్ బ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక**

పటాన్‌చెరు: అమీన్‌పూర్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడుగా ఎల్.కేదార్‌నాథ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బీరంగూడ గుట్టపై మల్లన్న ఆలయంలో బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా తేజమూర్తుల రాజేంద్ర శర్మ, ఉపాధ్యక్షులుగా నందగిరి వెంకట్రావు, పంచాగ్నుల సుమిత, కోశాధికారిగా శ్రీనివాస్‌రావు ఎన్నికయ్యారు. అనంతరం సంఘం కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

**◆ చికిత్స పొందుతూ మహిళ మృతి**

సంగారెడ్డి అర్బన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఆదివారం సంగారెడ్డి సీఐ శ్రీధర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునిపల్లి మండలం బుదెరా గ్రామానికి చెందిన సాయమ్మకు జనవరి 22వ తేదీన తీవ్రంగా గాయపడటంతో స్థానికులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జనవరి 27వ తేదీన మృతి చెందింది. మృతురాలు సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో డాక్టర్, వార్డ్ బాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**◆ తాగునీటికి కటకట**

జహీరాబాద్ టౌన్: తాగునీటికి ఇబ్బందిపడుతున్నట్లు మండలంలోని బూచినెల్లి గ్రామం 1వ వార్డు ప్రజలు తెలిపారు. ఆదివారం స్పెషల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. వార్డు పరిధిలో ఉన్న బోరు పాడై వారం రోజులైందని మరమ్మతులు చేయించడంలేదన్నారు. బిందెడు నీటి కోసం అవస్థలు పడుతున్నామని వాపోయారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

# ఘనంగా శివయ్య మహాపడి పూజ


మహాపడి పూజ నిర్వహిస్తున్న గణేశ్ గురుస్వామి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శివాలయంలో ఆదివారం రాత్రి నేత్రపర్వంగా శివయ్య మహాపడి పూజ నిర్వహించారు. కైలాసగిరి శివాలయం ప్రధాన పూజారి గణేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో శివస్వాములు మెట్ల పూజను భక్తి శ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా శివస్వాములు, భక్తులు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో జహీరాబాద్, సదాశివపేట, నారాయణఖేడ్, హోతి (కె), సత్వార్, అనేగుంట గ్రామాల శివ స్వాములు భక్తులు పాల్గొన్నారు.


హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

### విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్చెరు): తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కార్నివాల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 30 మంది తెల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ, ప్రతినిధులు దీప్తి, రవికిరణ్, కవిత, రవి రమణ, రామ్ కుమార్ పాల్గొన్నారు.